వరములివ్వు వినాయకా..

ఉండ్రాళ్లస్వామికి ఊరూరా, వాడవాడలా మండపాలు వెలిశాయి. గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల నియోజకవర్గాల్లో వినాయక చవితి ఉత్సవాలకు ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. శనివారం పండగ కావడంతో మండపాల నిర్వాహకులు గురు, శుక్రవారాల్లో వినాయకుడి ప్రతిమలను కొనుగోలు చేసి గ్రామాలకు తరలించారు. 10–20 అడుగుల భారీ విగ్రహాల వరకూ కొనుగోలు చేసి లారీలు, ట్రాక్టర్లు, ఆటోలు తదితర వాహనాల్లో తీసుకెళ్లారు. శనివారం ఉదయం మండపాల్లో వాహనాలను కొలువుదీర్చి పూజలు ప్రారంభించనున్నారు. కాగా వినాయకచవితి పండగ సందర్భంగా పట్టణాల్లో పూల దుకాణాలు కిటకిటలాడాయి. పండగ కోసం వినాయకుని ప్రతిమలు, పూజా సామగ్రి, చెరుకు, పత్రి, మామిడి ఆకులు, అరటి పండ్లు, టెంకాయలు తదితర అమ్మకాలు జోరందుకున్నాయి.

- వాడవాడలా గణపతి మండపాలు
- వివిధ రూపాల్లో కొలువుదీరనున్న విగ్రహాలు



గుత్తిలో జనసంద్రంగా అమృత్ సినిమా థియేటర్ రోడ్డు



వినాయక విగ్రహాలను కొనుగోలు చేస్తున్న జనం



గుంతకల్లులో విక్రయాలకు సిద్ధంగా గణనాథుడి విగ్రహాలు

గుంతకల్లు: గుంతకల్లు నియోజకవర్గంలో సుమారు 600లకుపైగా మండపాలు సిద్ధం చేశారు. ఒక్క గుంతకల్లులోనే దాదాపు 400లకు పైగా మండపాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిసింది. 9వ తేదీ సోమవారం మార్కెట్ యార్డు సమీపంలోని జీఎస్‌బీసీ కాలవ వద్ద ఏర్పాటు చేసిన నిమజ్జన వేడుకలతో ముగిస్తాయి. ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించుకునేందుకు కమిటీ సభ్యులుకు పోలీసు అధికారులు ముందస్తుగా పలు సూచనలు చేశారు.

పండుగ కోలాహలం

గుత్తి: గుత్తి, గుత్తి ఆర్ఎస్‌లలో ఎక్కడ చూసినా వినాయక పండుగ కోలాహలం, సందడే కనిపించింది. ముఖ్యంగా గుత్తిలోని అమృత్ సినిమా రోడ్డు జనాలతో కిక్కిరిసిపోయింది. ఆర్ఎస్‌లోని పత్తి కొండ రోడ్డు, మెయిన్ బజార్, కటిక బజార్ జనాలతో కిక్కిరిసిపోయింది. శనివారం వినాయక పర్వదినం కావడంతో ఒక రోజు ముందుగానే పూజా సామగ్రి కొనుగోలు చేయడానికి ప్రజలు భారీగా తరలివచ్చారు.

యల్లనూరు: మండలవ్యాప్తంగా వాడవాడలా వినాయక విగ్రహాలను కొలువుదీరేందుకు సన్నద్ధం చేస్తున్నారు మంటపాల వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

పామిడి: పామిడిలో వినాయచవితి పండుగను పురస్కరించుకుని శుక్రవారం ఉండ్రాళ్లస్వామికి ఊరంతా పందిర్లు వేశారు. కమిటీ సభ్యులు మండపాలను విద్యుద్దీపాల అలంకరణతో శోభాయానంగా అలంకరించారు.



గుంతకల్లులో పూజలందుకుంటున్న వెండి వినాయకుడు



ఎస్ఆర్ఐటీలో మట్టి వినాయక విగ్రహాలను అందజేస్తున్న దృశ్యం

భక్తిశ్రద్ధలతో వెండి వినాయకుడి పల్లకీ ఉత్సవం

గుంతకల్లు: లిమ్కా బుక్ ఆఫ్ రికార్డులో చోటు సంపాందించిన వరసిద్ధి వెండి వినాయక విగ్రహాన్ని పట్టణంలోని ఆర్యవైశ్యలు అత్యంత భక్తిశ్రద్ధలతో మంగళ వాయిద్యాల నడుమ పల్లకీ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గాంధీ చౌక్ వద్ద వెండి వినాయక శాశ్వత సేవ దాత మంచికంటి భాస్కర్ రంగయ్య కుటుంబసభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. అక్కడ నుంచి ప్రధాన రహదారి మీదుగా కన్యకాపరమేశ్వరదేవి ఆలయానికి చేర్చారు. ఆలయ ప్రాంగణంలోని మండపంలో ప్రత్యేక పీఠంపై కొలువుదీర్చి పంచగంగతో అభిషేకం చేశారు. అంతకుముందు విగ్రహ దాత చంద్రశేఖర్ ఇంట్లో వెండి వినాయకుడికి (120 కిలోల బరువు) వేదపండితులు కేసరి శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయక విగ్రహాలే మేలు

బుక్కరాయసముద్రం: పర్యావరణ పరి రక్షణలో భాగంగా వినాయక చవితి వేడుకలకు మట్టి వినాయక విగ్రహాలే ఎంతో మేలని ప్రిన్సిపాల్ డాక్టర్ బాలక్రిష్ణ అన్నారు. శుక్రవారం మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాలలో పర్యావరణ పరి రక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కళాశాల యాజమాన్యం మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేసింది. కళాశాల టీపీఓ డాక్టర్ రంజిత్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మట్టి వినాయక ప్రతిమల పంపిణీ

గుంతకల్లుటౌన్: పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా రోటరీక్లబ్ సభ్యులు శుక్రవారం బీరప్పగుడి సర్కిల్, ధర్మవరం గేట్ ఏరియాల్లో 600 మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. రోటరీక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు శివానంద, శ్రీనివాసులు, సీనియర్ రొటేరియన్లు తదితరులు పాల్గొన్నారు.

వినాయక చవితి శుభాకాంక్షలు



కేతిరెడ్డి పెద్దారెడ్డి



వై.వెంకట రామిరెడ్డి

తాడిపత్రిటౌన్/గుంతకల్లు టౌన్: తాడిపత్రి, గుంతకల్లు నియోజకవర్గ ప్రజలకు మాజీ ఎమ్మెల్యేలు కేతిరెడ్డి పెద్దారెడ్డి, వై.వెంకటరామిరెడ్డి శుక్రవారం వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు వారు వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు. సకాలంలో వర్షాలు కురిసి రైతులకు ఈ ఏడాది మంచి లాభసాటి వ్యవసాయం కలగాలని, అలాగే చిరు వ్యాపారులకు శుభాలు కలగాలని, నియోజకవర్గ ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని ఆశిస్తూ ఆ వినాయకుడిని ప్రార్థిస్తున్నామన్నారు.

క్లుప్తంగా

వరద బాధితులకు విరాళం



కలెక్టర్ వినోద్‌కుమార్‌కు చెక్కు అందజేస్తున్న శ్రీసాయిరాం పాఠశాల కరస్పాండెంట్

అనంతపురం అర్బన్: విజయవాడ వరద బాధితుల సహాయార్థం విద్యార్థులు విరాళం అందించడం అభినందనీయమని కలెక్టర్ వి.వినోద్ కుమార్ అన్నారు. పెద్దపప్పూరులోని శ్రీ సాయిరాం ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు వరద బాధితుల సహాయార్థం రూ.30,159 సేకరించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పాఠశాల కరస్పాండెంట్ మదన్ మోహన్ రెడ్డి తదితరులు కలెక్టర్‌ను కలిసి విరాళం మొత్తాన్ని చెక్కు రూపంలో అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వరద బాధితులకు సహాయం అందించేందుకు విద్యార్థులు ముందుకు రావడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం మల్లీశ్వరి, ఇన్‌చార్జ్‌లు రామాంజనేయులు, గిరి, ఉపాధ్యాయులు భాస్కర్, అనంతయ్య, బాలాజీ, అంపయ్య, రమేష్, పీరా, బాషా పాల్గొన్నారు.

తైక్వాండో జాతీయ జట్టు కోచ్‌గా సాయిబాబా



తాడిపత్రి అర్బన్: ఈనెల 8,9,10 తేదీల్లో ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాలో జరుగబోయే జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఆంధ్రప్రదేశ్ నుంచి టీం కోచ్‌గా ఎం.సాయిబాబా ఎంపికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ వేణుగోపాల్‌రావు శుక్రవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం సాయిబాబా జిల్లా తైక్వాండో కార్యదర్శిగా కొనసాగుతున్నారు. పోటీల్లో మన రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి సబ్ జూనియర్, జూనియర్ కేటగిరిలలో సుమారు 86 మంది క్రీడాకారులు పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు.

పెరటి తోటల పెంపకం లాభదాయకం



మహిళా రైతులకు విత్తనాలను అందజేస్తున్న డాక్టర్ విజయ శంకర్‌బాబు

బుక్కరాయసముద్రం: పెరటి తోటల పెంపకం లాభదాయకమని రేకులకుంట ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ శంకర్‌బాబు సూచించారు. శుక్రవారం అఖిల భారత మెట్ట వ్యవసాయ పరిశోధనా స్థానం హైదరాబాద్, రేకులకుంట వ్యసాయ పరిశోధనా స్థానం సంయుక్తంగా నార్పల మండలంలోని నిలువరాయి గ్రామంలో రైతులకు పెరటి తోటల పెంపకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయనతోపాటు ఆన్‌ఫాం రీసెర్చ్ శాస్త్రవేత్త డాక్టర్ లక్ష్మీకళ్యాణి పెరటి తోటల పెంపకం, యాజమాన్య పద్ధతులపై రైతులకు వివరించారు. అనంతరం రైతులకు పెరటి తోటల పెంపకం సంబంధించిన విత్తనాలను అందజేశారు. కార్యక్రమంలో మహేష్, చంద్ర, ప్రసాద్ రైతులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే సహించబోం



పెద్దవడుగూరులో మాట్లాడుతున్న డీఎస్పీ జనార్దన్‌నాయుడు



గుంతకల్లులో మాట్లాడుతున్న టూటౌన్ సీఐ మస్తాన్

పెద్దవడుగూరు: శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే సహించబోమని తాడిపత్రి డీఎస్పీ జనార్దన్‌నాయుడు హెచ్చరించారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో వినాయక చవిత ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటి గొడవలకు తావు ఇవ్వకుండా ఉత్సవం నిర్వహించుకోవాలన్నారు. ఎవరైనా గొడవలు సృష్టించడానికి పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. మండపంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిమజ్జనం సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో యాడికి రూరల్ సర్కిల్ సీఐ రామసుబ్బయ్య, ఎస్ఐ చిన్నరెడ్డప్ప సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సవాల్లో నియమాలు పాటించండి

గుంతకల్లుటౌన్: వినాయకచవితి పండుగను ప్రజలు సంబరంగా జరుపుకోవాలని, అదే క్రమంలో పోలీసు, ఉత్సవ కమిటీ రూల్స్‌ను అతిక్రమించవద్దని వన్‌టౌన్, టూటౌన్ సీఐలు మనోహర్, ఏపీ మస్తాన్ సూచించారు. శుక్రవారం వన్‌టౌన్ పీఎస్‌లో హిందూ, ముస్లిం, క్రిస్టియన్ మతాల పెద్దలతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. వినాయక నిమజ్జనం రోజు ఊరేగింపులో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా భద్రతా చర్యలు చేపట్టామన్నారు. నిబంధనలను ఉల్లంఘించి చట్టాన్ని చేతుల్లో తీసుకుంటే కఠిన చర్యలు తప్పవని వారు హెచ్చరించారు.

పండుగను ప్రశాంతంగా జరుపుకోండి

యల్లనూరు: వినాయక చవితి వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని తహసీల్దారు నాగరాజు, పుట్లూరు సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ పండుగను ప్రశాంతంగా ఆహ్లాదకరమైన వాతావరణంలో జరుపుకోవాలన్నారు. ఏవైనా సమస్యలుంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు.

నిమజ్జన ప్రాంతాల పరిశీలన

తాడిపత్రి రూరల్: వినాయక విగ్రహాల నిమజ్జన ప్రాంతాలను శుక్రవారం డీఎస్పీ జనార్దన్ నాయుడు, పోలీసులు పరిశీలించారు. మండలంలోని ఆలూరు కోన, పెద్దపప్పూరు మండలం చీమలవాగుపల్లి మీపాల్లోని నీటి కుంటలను పరిశీలించి జాగ్రత్తలను సమీక్షించారు. తాడిపత్రి పట్టణంలో ఐదు రోజులు, ఆయా మండలాల్లో మూడు రోజుల అనంతరం గణపతుల నిమజ్జన కార్యక్రమం జరుగనుంది. డీఎస్పీ వెంట తాడిపత్రి పట్టణ, రూరల్, పెద్దవడుగూరు సీఐలు సాయిప్రతాప్, శివగంగాధర్‌రెడ్డి, రామసుబ్బయ్య, పెద్దపప్పూరు ఎస్ఐ గౌస్ తదితరులున్నారు.

శింగనమల: అనంతపురంలోని వినాయక విగ్రహాలను శింగనమల చెరువులో నిమజ్జనం చేయడానికి అనుకూలతపై శుక్రవారం అనంతపురం ఆర్డీఓ వసంతబాబు, అనంతపురం డీఎస్పీ ప్రతాప్‌కుమార్ పరిశీలించారు. అనంతపురం నుంచి శింగనమల చెరువు వరకూ 20 కిలోమీటర్ల వరకు ఉంటుందని గుర్తించారు. చాలా దూరం అవుతుందని, నిమజ్జనానికి అనుకూలంగా ఉండదని భావించారు. తహసీల్దార్ బ్రహ్మయ్య, సీనియర్ అసిస్టెంట్ వెంకట్రామిరెడ్డి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

సీసీ కెమెరాలు అందుబాటులోకి తేవాలి

యాడికి: పెద్దపప్పూరు మండలంలోని చీమలవాగుపల్లి టోల్‌గేట్ వద్ద మరమ్మతులకు గురైన సీసీ కెమెరాలను అందుబాటులోకి తీసుకురావాలని సీఐ రామసుబ్బయ్య ఆదేశించారు. శుక్రవారం టోల్‌గేట్‌ను సీఐ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తలనీలాల సేకరణకు 18న వేలం

గుత్తి రూరల్: మండలంలోని తొండపాడు బొలికొండ రంగనాథ స్వామి ఆలయంలో భక్తులు సమర్పించిన తలనీలాల సేకరణకు ఈ నెల 18న వేలం నిర్వహించనున్నట్లు ఈఓ నాగేంద్రుడు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో ఉదయం 11 గంటల సమయంలో వేలం నిర్వహిస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు రూ.20 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు.

బ్యూటీషియన్ కోర్సుతో ఉపాధి

పామిడి: బ్యూటీషియన్ కోర్సుతో మహిళలకు ఉపాధి లభిస్తుందని గుత్తి ఐసీడీఎస్ సీడీపీఓ డిల్లీశ్వరి అన్నారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన బ్యూటీషియన్ కోర్సు శిక్షణ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేశారు. అనంతరం గర్భవతులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన చేశారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార ఎగ్జిబిషన్‌ను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ నాగమణి, సూపర్‌వైజర్లు రామలక్ష్మి, లక్ష్మీనర్సమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కత్తిమానుపల్లిలో నేత్రదాన పక్షోత్సవాలు

యాడికి: మండలంలోని కత్తిమానుపల్లి ప్రాథమిక పాఠశాలలో 21 మంది విద్యార్థులకు శుక్రవారం జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా యాడికి పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీరామ్‌కుమార్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో ఐదుగురికి కంటి అద్దాలు అవసరమున్నట్లు గుర్తించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రామ్‌ప్రసాద్‌గౌడ్, 104 సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడికి సన్మానం

గుత్తి: పట్టణంలోని కోట జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుబహాన్‌ను శుక్రవారం ఏపీటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఆయన సొంత ఖర్చులతో పాఠశాలలో మరుగుదొడ్లు, రేకుల షెడ్డు వేయించాడు. అంతే కాకుండా విద్యార్థులు ఆడుకునేందుకు చిన్న సైకిళ్లు, ఉయ్యాల ఇప్పించిన సందర్భాన్ని పురస్కరించుకుని హెచ్ఎంను ఏపీటీఎఫ్ నాయకులతో పాటు ఉపాధ్యాయులు శాలువాలు,పూల మాలలతో సత్కరించారు.

ఆహార భద్రతాచట్టం అమలు చేయాలి

పెద్దవడుగూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆహార భద్రతా చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని మండల సీపీఐ నాయకులు నారాయణ, ఎద్దుల సూర్యనారాయణరెడ్డి, మండల కార్యదర్శి వెంకట్రాముడుయాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ధరలు స్థిరీకరణకు బడ్జెట్ లో తగు నిధులు కేటాయించాలన్నారు. అర్హులైన వారందరికీ రేషన్ కార్డులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో హామీ మేరకు రైతులకు రూ.20 వేలు పెట్టుబడి సాయం అందజేయాలన్నారు. అనంతరం పలు రకాల డిమాండ్ల తో కూడిన వినతి పత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వరమ్మకు అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'రైతులకు పెట్టుబడిసాయం అందించాలి'

శింగనమల: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతులకు పెట్టుబడిసాయం రూ.20 వేలు వెంటనే అందించాలని సీపీఎం కార్యవర్గ సభ్యుడు బాలరంగయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం శింగనమలలో సీపీఎం మండల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి భాస్కర్, జయరాముడు, ఓబిరెడ్డి, కొండారెడ్డి, సుంకన్న, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.